ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త



: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-11-2025,మంగళవారం

## 45 ఏళ్ల తర్వాత మావోయిస్టు నేత లొంగిపోయాడు!



**హైదరాబాద్, అక్టోబర్28:** తెలంగాణ మావోయిస్టు ఉద్యమంలో కీలక మలుపు చోటుచేసుకుంది.45 సంవత్సరాలుగా అజ్ఞాత జీవితం గడిపిన రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్ చివరికి అధికారుల ఎదుట లొంగిపోయారు.మంచిర్యాలజిల్లా మందమర్రికి చెందిన ఆయన, మొదట సింగరేణి కార్మికుడిగా పనిచేశారు.1980లో ప్రజాఉద్యమాలకు ఆకర్షితుడై పీపుల్స్ వార్‌పార్టీతో అనుబంధంఏర్పరుచుకున్నారు. 1984లో నేత అబ్రహం హత్య కేసులో అరెస్టైన ఆయన, అడిలాబాద్ సబ్‌జైలు నుంచి తప్పించుకుని భూగర్భంలోకి వెళ్లిపోయారు.దశాబ్దాలుగా మావోయిస్టు కార్యకలాపాల్లో పాల్గొన్న బండి ప్రకాష్, ఇటీవల కుటుంబ ఒత్తిళ్లు మరియు ప్రభుత్వ పునరావాస పథకాల కారణంగా లొంగిపోవాలని నిర్ణయించుకున్నారు. తెలంగాణ పోలీసు అధిపతి శివధర్ రెడ్డి సమక్షంలో ఆయన సరెండర్ అయ్యారు. ఆయన నిర్ణయం మావోయిస్టు కార్యకలాపాలపై పెద్ద ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.ఇదిలా ఉండగా.ఇటీవల పెద్ద సంఖ్యలో మావోయిస్టులు అడవి మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు.అక్టోబర్ మూడో వారంలో దాదాపు 238 మంది మావోయిస్టులు లొంగిపోచారు.17న బస్తర్ జిల్లా ప్రధాన కార్యాలయం జగదల్పూర్లో అధికారుల ముందు లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యుడితో సహా దాదాపు 210 మంది మావోయిస్టులు లొంగిపోయిన విషయం తెలిసిందే. రూ.9.18 కోట్ల రివార్డును ప్రకటించారు.లొంగిపోయిన సీనియర్ నేతల్లో కేంద్ర కమిటీ సభ్యుడు రూపేష్ అలియాస్ సతీశ్,భాస్కర్ అలియాస్ రాజ్మన్ మాండవి,రాణిత,రాజు సలాం,ధన్ను వెట్టి,అలియాస్ సంతు,నలుగురు సభ్యులు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,ప్రాంతీయ కమిటీ సభ్యుడు రతన్ ఎలామ్ ఉన్నారు.

# అతలాకుతలం చేస్తున్న తుఫాన్



**విజయవాడ, అక్టోబర్28:** ఆంధ్రప్రదేశ్‌లో మొంథా తుఫాను విధ్వంసక రూపంసంతరించుకుంటుంది.రాష్ట్ర వ్యాప్తంగా 233 మండలాలు,1,419 గ్రామాలు మరియు 44 మున్సిపాలిటీలు ఈ తుఫాను ప్రభావానికి గురవుతున్నాయి.కోస్తామరియు రాయలసీమ ప్రాంతాలలో అనేక చోట్ల చిరుజల్లులు మొదలై,వాతావరణం మరింత తీవ్రమవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. భారతీయ వాతావరణ శాఖ మరియు సంస్థలు నెల్లూరు నుండి శ్రీకాకుళం వరకు ఉన్న తీరప్రాంతంలో 4.7 మీటర్ల ఎత్తు వరకు అలలు ఎగసిపడే అవకాశం ఉందని హెచ్చరించాయి.తుఫాను ముందస్తు హెచ్చరికలు మరియు ప్రభావం మొంథా తుఫాను అక్టోబర్ 28న సాయంత్రం లేదా రాత్రి సమయంలో కాకినాడ సమీపంలో మచిలీపట్నం మరియు కళింగపట్నం మధ్య తీరాన్ని తాకే అవకాశం ఉంది. ఈ తుఫాను సమయంలో గాలి వేగం గంటకు 90 నుండి 100 కిలోమీటర్ల వరకు ఉండే అవకాశం ఉండగా,కొన్ని సమయాల్లో ఈ వేగం 110 కిలోమీటర్ల వరకు చేరుకోవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ తీవ్ర వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అనేక తీర ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసారు. ప్రజలు అత్యవసర పరిస్థితులు లేనివరకు బయటకు రాకుండా ఉండాలని అధికారులు కోరుతున్నారు.ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు ఈ తుఫాను సమయంలో ప్రజలు ఎలాంటి అధికారికేతర సమాచారాన్ని నమ్మకుండా,ప్రశాంతంగా ఉండాలని అధికారులు అభ్యర్థిస్తున్నారు.అత్యవసర సమయాల్లో కమ్యూనికేషన్ కోసం మొబైల్ ఫోన్లను పూర్తిగా ఛార్జ్ చేసుకోవడం మరియు అధికారిక వాతావరణ హెచ్చరికలను గమనించడంఅత్యవసరం.ఇంటి లోపల ఉన్నప్పుడు విద్యుత్‌మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి మరియు అన్ని విద్యుత్,గ్యాస్ కనెక్షన్లను >>2

## రైతులకు శుభవార్త - ఖాతాల్లోకి రూ.2 వేల జమా!

**న్యూఢిల్లీ, అక్టోబర్28:** కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆర్థిక సహాయం అందించే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద 21వ విడత నిధుల విడుదలకు సన్నాహాలు ప్రారంభించింది.ఇప్పటివరకు 20 విడతలు విజయవంతంగా పంపిణీ చేయగా,తదుపరి విడతను నవంబర్ ప్రారంభంలో విడుదల చేయనున్నట్లు సమాచారం.ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 8.5 కోట్ల మంది అర్హులైన రైతులు ఒక్కొక్కరు రూ.2,000 చొప్పున పొందనున్నారు.అంటే సంవత్సరానికి మొత్తంగా రూ.6,000 మొత్తాన్ని ప్రభుత్వం మూడు విడతలుగా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో జమ చేస్తోంది.రైతులు తప్పనిసరిగా చేయాల్సిన పనులు >>2





## ఒక్కరోజులో బంగారం ధరల్లో భారీ తగ్గుదల!

**న్యూఢిల్లీ, అక్టోబర్28:** దేశంలో బంగారం ధరలు ఇటీవల నిరంతరంగా పెరుగుతూ వస్తున్నాయి. నిపుణుల అంచనాల ప్రకారం తులం బంగారం ధర రూ.2 లక్షలకు చేరే అవకాశం ఉందని భావిస్తున్న వేళ, ఒక్కసారిగా బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి.హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.820 తగ్గి ప్రస్తుతం రూ.1,22,460గా ఉంది.22 క్యారెట్ల బంగారం ధర రూ.750 తగ్గి రూ.1,12,250గా నమోదైంది.వివిధ నగరాల్లో బంగారం ధరలు(10 గ్రాముల కొద్దీ): విజయవాడ: 24క్యారెట్ల బంగారం-1,22,460 +22 క్యారెట్ల బంగారం-1,12,250 చెన్నై:24 క్యారెట్ల బంగారం-1,23,280+22 క్యారెట్ల బంగారం-1,13,000 ముంబై: 24 క్యారెట్ల బంగారం-1,22,460+22 క్యారెట్ల బంగారం-1,12,250,ఢిల్లీ:24 క్యారెట్ల బంగారం-1,23,420+22 క్యారెట్ల బంగారం-1,13,140అహమ్మదాబాద్:24క్యారెట్ల బంగారం- 1,23,320 +22క్యారెట్లబంగారం-1,13,040బెంగళూరు: 24 క్యారెట్ల బంగారం-1,22,460+22 క్యారెట్ల బంగారం-1,12,250 నిపుణుల ప్రకారం, అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ బలపడటం,గ్లోబల్ ఎకానమీమార్పులు,సెంట్రల్ బ్యాంకుల పాలసీలు వంటి అంశాలు బంగారం ధరల్లో ఈ తేడాలకు కారణమవుతున్నాయి.



## తీరం దాటబోతున్న మొంథా - కోస్తాంధ్ర ప్రజలకు అలర్ట్

**కోస్తాంధ్ర, అక్టోబర్28:** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను వేగంగా పశ్చిమ దిశగా కదులుతోంది.రాత్రి 9 గంటల తర్వాత ఆంధ్రప్రదేశ్ తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.ప్రస్తుతం ఈ తుపాను బలమైన గాలులతో ముందుకు సాగుతోందని,దీని ప్రభావం ఇప్పటికే కోస్తాంధ్ర ప్రాంతాల్లో కనిపిస్తున్నదని అధికారులు తెలిపారు.తుపాను తీరం దాటే సమయానికి గంటకు 90-100 కి.మీ.వేగంతో ఈదురుగాలులు వీసే అవకాశం ఉందని అంచనా.అంతర్వేది,రాజోలు,అమలాపురం, దేవగుప్తం,కాట్రేనికోన,పోలవరం,యానాం,గుట్టెనదీవి,ముమ్మిడివరం పరిసర ప్రాంతాల్లో రాత్రి సమయంలో తుపాను భూభాగాన్ని తాకనుంది.తీవ్ర వర్షాల హెచ్చరిక-ప్రజలకు అప్రమత్తత సూచన తుపాను ప్రభావంతో కోనసీమ,కాకినాడ,పశ్చిమ గోదావరి, విశాఖపట్నం,విజయనగరం,శ్రీకాకుళం,నెల్లూరు,గుంటూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.పలు తీరప్రాంతాల్లో ఇప్పటికే వర్షాలు మొదలయ్యాయని,కొన్ని ప్రాంతాల్లో గంటకు 85 కి.మీ.ల వేగంతో గాలులు వీస్తున్నాయని తెలిపారు.రానున్న రెండు రోజులపాటు కోస్తాంధ్ర మొత్తం తుపాను ప్రభావంలో ఉండే అవకాశం ఉంది.ప్రజలు అవసరం లేని ప్రయాణాలు మానుకోవాలని, విద్యుత్ స్తంభాలు,చెట్లు వంటి ప్రమాదకర ప్రాంతాల వద్ద నిలవకూడదని అధికారులు సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు వెళ్లాలని సూచన ఇచ్చారు.

## హరీశ్ రావు తండ్రి కన్నుమూత



**హైదరాబాద్, అక్టోబర్28:** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న మాజీ మంత్రి,బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు ఇంట విషాదం నెలకొంది.ఆయన తండ్రి తన్నీరు సత్యనారాయణరావు ఈ తెల్లవారుజామున కన్నుమూసిన సంగతి తెలిసి రాజకీయ వర్గాల్లో శోకసంద్రం అలుముకుంది. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన,చికిత్స పొందుతూ కన్నుమూశారు.కరీంనగం జిల్లాకొత్తపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణరావు,కుటుంబానికి మాత్రమే కాదు,గ్రామానికీ ఘనత తీసుకొచ్చిన వ్యక్తిగా పేరు పొందారు.సత్యనారాయణరావు సాధారణ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ, మంచి విలువలు,నిష్ఠ కలిగిన వ్యక్తిగా అందరూ గుర్తిస్తున్నారు.తన పిల్లలను ఉన్నత స్థానాలకు చేర్చేందుకు చూపిన పట్టుదలే హరీశ్ రావును రాష్ట్ర రాజకీయాల్లో శక్తివంతమైన నేతగా ఎదగేలా చేసింది.కుటుంబానికి బలమైన వెన్నెముకలా ఆయన ఎప్పుడూ నిలిచారు. సామాన్య ప్రజల సమస్యలు తెలిసి,వారికష్టాలు తన కష్టాలుగా భావించే హృదయం ఆయనది. గ్రామస్తుల అభివృద్ధి కోసం అనేక సేవా కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనడం ఆయన స్వభావం.సత్యనారాయణ మృతి వార్త తెలిసిన వెంటనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్,కేటీఆర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలు సంతాపం వ్యక్తం చేశారు.హరీశ్ రావు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పేందుకు పలువురు నాయకులు,అభిమానులు చేరుకోవడం ప్రారంభించారు.రాజకీయాల్లో బిజీగా ఉండే తానే కాక,పిల్లలపై తండ్రి చూపిన ప్రేమ,మార్గనిర్దేశం ఎల్లప్పుడూ హరీశ్‌రావును ముందుకు నడిపిందని స్రోత్రాలు చెబుతున్నాయి.సత్యనారాయణకు నివాళులర్పిస్తూ,ఆయన కుటుంబానికి అన్నివర్గాల నుంచిసానుభూతి వెల్లువడుతోంది.కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతిసత్యనారాయణ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.విషయం తెలిసిన వెంటనే కేసీఆర్.హరీశ్‌రావుకు ఫోన్ చేసి పరామర్శించారు.కుటుంబ సభ్యులను ఓదార్చి,వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని సూచించారు.తన బావ అయిన సత్యనారాయణ మృతి పట్ల ప్రగాఢ సంతాపం ప్రకటించారు.ఆయనతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని కేసీఆర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు.సత్యనారాయణ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.సిద్దిపేటలో విషాద వాతావరణం నెలకొంది. ప్రజలు పెద్ద ఎత్తున హరీశ్‌రావు ఇంటికి చేరుకుని ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్నారు.

## తెలంగాణ లో టీచర్ల బదిలీలకు భారీగా దరఖాస్తులు

**హైదరాబాద్, అక్టోబర్28:** తెలంగాణలో 317 జీవో కింద స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయుల సమస్య పరిష్కార దిశగా ముందడుగుపడింది.ఈ క్రమంలో బదిలీల కోసం దరఖాస్తుల స్వీకరణ గడువు ఆదివారం ముగియగా,మొత్తం6,500 అప్లికేషన్లు అందినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.చాలాకాలంగా ఎదురుచూస్తున్న టీచర్లకు ఈ ప్రక్రియ పునరుద్ధరణతో ఆశకలిగించింది. అందిన దరఖాస్తులను సంబంధిత జిల్లా విద్యా శాఖ అధికారులు పరిశీలనకు తీసుకుంటున్నారు. స్థానికత కేటాయింపు, జోన్ల ప్రాతిపదికన ఉన్న లోపాలు,గతబదిలీలలో జరిగిన పొరపాట్లు వంటి అంశాలపై ప్రతి దరఖాస్తును పరీక్షించి,తదుపరి దశకు పంపనున్నారు.ఈ పరిశీలన ప్రక్రియ 3-4 రోజుల్లో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.స్క్రూటినీ అనంతరం తుది జాబితా ప్రభుత్వానికి అందజేయబడుతుంది. అయితే వచ్చిన దరఖాస్తుల్లో సుమారు50 మాత్రమే నిబంధనల ప్రకారం అర్హత సాధించే అవకాశం ఉందని తెలుస్తోంది.ఈ నేపథ్యంలో అర్హత



పొందని వారిలో మరోసారి అసంతృప్తి వ్యక్తం అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.317 జీవో సమస్యను పూర్తిగా పరిష్కరించి,గతంలో కోల్పోయిన హక్కులను పునరుద్ధరించాలన్నది ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్.బ్యూరోక్రాటిక్ ప్రక్రియలు వేగవంతం చేస్తూ ప్రభుత్వం త్వరగా తీర్మానాలు తీసుకోవాలంటూ టీచర్లు ఎదురుచూస్తున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయల బదిలీలల్లో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీగా దరఖాస్తులు వచ్చాయి.

## అమెజాన్‌లో మరోసారి భారీ ఉద్యోగాల కోత



**న్యూఢిల్లీ, అక్టోబర్28:** ప్రముఖ ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమవు తోంది.కరోనా మహమ్మారి సమయంలో పెరిగిన డిమాండ్ కారణంగా అధికంగా నియమించుకున్న సిబ్బందిని తగ్గించుకోవడమే లక్ష్యంగా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.విశ్వసనీయ వర్గాల ప్రకారం,మంగళవారం నుంచి సుమారు30,000 మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించేందుకు అమెజాన్ ప్రణాళికలు సిద్ధం చేస్తోందట.మొత్తం 15.5 లక్షల మంది అమెజాన్ ఉద్యోగులతో పోలిస్తే ఈసంఖ్య స్వల్పమే అయినప్పటికీ,కంపెనీలోని 3.5లక్షల కార్పొరేట్ సిబ్బందిలో ఇది దాదాపు 10 శాతానికి సమానం.2022 చివర్లో 27,000 మంది ఉద్యోగులను తొలగించిన తర్వాత,ఇదే అతిపెద్ద లేఆఫ్ కావడం గమనార్హం.అయితే,ఈ వార్తలపై స్పందించేందుకు అమెజాన్ ప్రతినిధి నిరాకరించారు.ఈ ఉద్యోగాల కోత ప్రభావం హ్యూమన్ రిసోర్సెస్ (పీపుల్ ఎక్స్‌పీరియన్స్ అండ్ టెక్నాలజీ),ఆపరేషన్స్,డివైజెస్, సర్వీసెస్, అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) వంటి పలుకీలక విభాగాలపై ఉండే అవకాశం ఉంది.సోమవారం మేనేజర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు సమాచారం ప్రభావిత ఉద్యోగులకు మంగళవారం ఉదయం నుంచి ఈమెయిల్స్ ద్వారా సమాచారం ఇవ్వనున్నారు.ఈ నేపథ్యంలో సిబ్బందితో ఎలా వ్యవహరించాలనే అంశంపై సోమవారం మేనేజర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లుసమాచారం. >>2

## ఫ్లుటోనియం డీల్ రద్దు.. ట్రంప్ కు పుతిన్ షాక్

**వాషింగ్టన్, అక్టోబర్28:** రష్యాఉక్రెయిన్ల మధ్య యుద్ధం విషయంలో పుతిన్,ట్రంప్ లమధ్య గతకొంతకాలంగా విభేదాలుచోటుచేసుకుంటున్నాయి.ఎలాగైనా యుద్ధాన్ని ఆపివేయాలని ట్రంప్ చేస్తున్న తీవ్ర ప్రయత్నాలకు పుతిన్ అడ్డుకుంటున్నారు.దీంతో రెండుదేశాల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు ఉన్నాయి.చమురు విషయంలో రష్యాను దెబ్బతీయాలని భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలును తగ్గించాలని ఆదేశించారు.కానీ భారత్ దీన్ని ఏమాత్రం ఖాతరు చేయలేదు. తాజాగా పుతిన్ ట్రంప్ కు బిగ్ షాక్ నిచ్చారు.అమెరికాతో ఉన్న ఫ్లుటోనియం ఒప్పందాన్ని పుతిన్ రద్దు చేసుకున్నారు.దీనిపై పుతిన్ తాజాగా సంతకం చేశారు.దీంతో ఇప్పటివరకు ఆగి ఉన్న అణు అగ్గి రాజుకున్నట్టయింది.రష్యాను కంట్రోల్ చేయడం కష్టమా?రష్యా దగ్గర అణు సామర్థ్యానికి,అణ్వాయుధాల తయారీకి సంబంధించిన మూల పదార్థాం చాలానే ఉంది.దానిని అడ్డం పెట్టుకునే ఇన్నాళ్లుగా మొండి వైఖరిని ప్రదర్శిస్తోంది.ష్యా కనుక అణుశక్తిని వాడడం మొదలుపెడితే ఆపడం ఎవ్వరి తరమూ కాదు. అందుకే అగ్రరాజ్యం అమెరికా ముందు జాగ్రత్తగా 2000 సంవత్సరంలో రష్యాతో ది ఫ్లుటోనియం మేనేజ్మెంట్ అండ్ డిస్ పొజిషన్ అగ్రిమెంట్ ను కుదుర్చుకుంది. దీనిప్రకారం యుద్ధాలు జరుగుతున్నప్పుడు తన దగ్గర నిల్వ ఉన్న 34 మెట్రిక్ టన్నుల ఫ్లుటోనియాన్ని అణ్వాయుధాల తయారీకి కాకుండా కేవలం పౌర అణు విద్యుత్ కోసం మాత్రమే వాడాలి.ఈ ఒప్పందాన్ని 2010లో మళ్లీ సవరించారు కూడా. దీని ద్వారా దాదాపు 17వేల అణ్వాయుధాల తయారుకాకుండా అడ్డుకున్నట్లు అవుతుందని అమెరికా లెక్కలు వేసింది.అయితే ఈ ఒప్పందానికి 2016లోనే గండిపడింది.బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడే రష్యాతో సంబంధాలు దెబ్బతిన్నాయి.ఆ వెంటనే పుతిన్ కూడా ఫ్లుటోనియం ఒప్పందాన్ని నిలిపివేశారు.తాజాగా దాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.నిరసనకారులు ప్రధానంగా ఇమిగ్రేషన్ పాలసీపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వలసదారుల హక్కులను తగ్గించేలా, విద్యా అవకాశాలను పరిమితం చేసేలా ట్రంప్ చర్యలు ఉన్నాయని వారు ఆరోపించారు. సెక్యూరిటీ పేరుతో దేశంలో భయానక వాతావరణం సృష్టించడం,సామాజిక వైవిధ్యాన్ని దెబ్బతీయడం జరుగుతోందని నిరసనకారులు తెలిపారు.అనే నినాదం ద్వారా అమెరికాలో ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని,ఏకపక్ష పాలనను అడ్డుకోవాలని సందేశం ఇచ్చారు.ఈ నిరసనల్లో విద్యార్థులు, వలసదారులు,మానవ హక్కుల సంస్థలు,సామాజిక కార్యకర్తలు



పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.భారత్ రష్యా నుంచి తక్కువ చమురు కొనుగోలు చేస్తుంది: ట్రంప్ ఇదే సమయంలో ట్రంప్ విధానాలపై అమెరికా బయట కూడా స్పందనలు వచ్చాయి. బ్రిటన్, కెనడా,జర్మనీ,ఆస్ట్రేలియా వంటి దేశాల్లోని అమెరికా ఎంబసీల ముందు కూడా ప్రజలు నిరసనలకు దిగారు.ట్రంప్ అంతర్జాతీయ అంశాల కంటే ముందుగా అమెరికాలోని విద్య, ఆరోగ్యం,ఉపాధి సమస్యలపై దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు. అమెరికా ప్రజలు తీసుకున్న ఈ గ్లోబల్ నిరసన చర్య ప్రజాస్వామ్య బలాన్ని మరోసారి చాటిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ట్రంప్ విధానాలు భవిష్యత్తులో దేశ రాజకీయాలను ఏ విధంగా ప్రభావితం చేస్తాయన్నదానిపై ఇప్పుడు అంతర్జాతీయ దృష్టి కేంద్రీకృతమైంది.చికాగో, వాషింగ్టన్, న్యూయార్క్ వంటి ప్రధాన నగరాల్లో ప్రజలు భారీగా రోడ్లపైకి వచ్చి ట్రంప్ పాలసీలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు.

## అమెజాన్‌లో మరోసారి భారీ ఉద్యోగాల కోత

>> కంపెనీలో అనవసరమైన ప్రక్రియలను తగ్గించేందుకు సీఈఓ ఆండీ జెస్సీ ప్రత్యేక చొరవ చూపుతున్నారు.దీనికి తోడు,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం పెరగడం వల్ల పునరావృతమయ్యే పనులను ఆటోమేట్ చేస్తూ సిబ్బందిని తగ్గిస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, ఈ ఏడాది ప్రారంభంలో అమలు చేసిన 'వారానికి ఐదు రోజులు ఆఫీసుకు రావాల్సి' అనే నిబంధన వల్ల చాలామంది ఉద్యోగులు స్వచ్ఛందంగా వైదొలుగుతారని కంపెనీ ఆశించినా,ఈ భారీ లేఆఫ్స్‌కు ఓ కారణంగా తెలుస్తోంది అది జరగకపోవడం కూడా ఈ భారీ లేఆఫ్స్‌కు ఓ కారణంగా తెలుస్తోంది.ఒకవైపు ఉద్యోగులను తొలగిస్తున్నప్పటికీ, రానున్న పండగల సీజన్ కోసం గిడ్డంగులు,ఇతర అవసరాల నిమిత్తం 2.5 లక్షల మంది తాత్కాలిక సిబ్బందిని నియమించుకోవాలని అమెజాన్ యోచిస్తోంది.కాగా,కంపెనీకి అత్యంత లాభదాయకమైన ఏడబ్ల్యూఎస్ విభాగం వృద్ధిరేటు,పోటీ సంస్థలైన మైక్రోసాఫ్ట్ అజూర్, గూగుల్ క్లౌడ్ కంటే వెనుకబడింది.అమెజాన్ తన మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను గురువారం ప్రకటించనుంది.

## బంగారం రేట్లు క్షీణించాయి ఇప్పుడు కొనాలా, ఆగాలా?

>> అంతర్జాతీయ మార్కెట్ రేట్లు ఇంపోర్ట్ డ్యూటీలు మరియు పన్నులు డాలర్ విలువలో మార్పులు భారతదేశంలో బంగారం కేవలం ఆర్థిక ఆస్తిమాత్రమే కాకుండా సంస్కృతిలో భాగంకూడా.వివాహాలు, పండుగలు వంటి సందర్భాల్లో బంగారం కొనుగోలు ప్రాముఖ్యం సంతరించుకుంటుంది.మార్కెట్ పరిస్థితులు తరచుగా మారుతుంటాయి కాబట్టి, కొనుగోలుదారులు మరియు ఇన్వెస్టర్లు రోజువారీ రేట్లను తెలుసుకుంటూ నిర్ణయాలు తీసుకోవడం మంచిది.

# మరో ఘోర రోడ్డు ప్రమాదం.. రెండు ఆర్టీసీ బస్సులు ఢీ




**విజయవాడ,అక్టోబర్28:**ఇటీవల కర్నూలుహైదరాబాద్ రోడ్డుపై జరిగిన ఘోర ప్రమాదం మరవక ముందే ఆంధ్రప్రదేశ్‌లో మరో విషాదం చోటుచేసుకుంది.చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం గూడూరుపల్లి సమీపంలో రెండుబస్సులు,ఒక ట్రాక్టర్ ఢీకొనడంతో భారీ ప్రమాదం జరిగింది.ప్రాథమిక సమాచారం ప్రకారం,ఈ ప్రమాదంలో 25 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.వారిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.అయితే ఈ ఘటనలో మదనపల్లె నుంచి పుంగనూరు వెళ్తున్న పల్లెవెలుగు బస్సును, పలమనేరు నుంచి పుంగనూరు వస్తున్న మరో పల్లెవెలుగు బస్సు ఢీకొట్టింది.అదే సమయంలో ఇసుకతో నిండిన ట్రాక్టర్ రెండు బస్సులను ఢీ కొట్టడంతో ప్రమాదం మరింత తీవ్రంగా మారింది.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు,పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు.

# ముస్లింలు లేరని గ్రామం పేరు మార్పు: యోగి నిర్ణయం!



**ఉత్తరప్రదేశ్, అక్టోబర్27:**ఉత్తరప్రదేశ్‌ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మరోసారి పేరు మార్పు నిర్ణయంతో వార్తల్లో నిలిచారు.లఖింపూర్ ఖేరి జిల్లాలోని ముస్తఫాబాద్ గ్రామం పేరును కబీర్ ధామ్'గా మార్చనున్నట్లు ఆయన ప్రకటించారు. ఆ గ్రామంలో ఒక్క ముస్లిం కుటుంబం కూడా నివసించడం లేదని సమాచారంరావడంతో,ఆయన ఈనిర్ణయం తీసుకున్నట్లుతెలిపారు.లఖింపూర్ ఖేరిలో జరిగిన విశ్వకళ్యాణ్ ఆశ్రమంలోని స్మృతి ప్రకటోత్సవ మేళా కార్యక్రమంలో పాల్గొన్న యోగి,గ్రామప్రజలతో మాట్లాడుతూ ఈవిషయాన్ని వెల్లడించారు.ఇక్కడ ముస్లింలు లేరని తెలుసుకున్నాను,అందుకే ముస్తఫాబాద్ పేరును కబీర్ ధామ్‌గా మార్చాలని నిర్ణయించాను' అని ఆయన అన్నారు.అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరలోనే అధికారికంగా పేరుమార్చాలని అధికారులను ఆదేశించారు.అదే వేళ యోగి, గతప్రభుత్వాల నిర్ణయాలను విమర్శించారు.మునుపటి పాలకులు ప్రజల మత విశ్వాసాలను దెబ్బతీయాలని ప్రయత్నించారు.అయోధ్యను ఫైజాబాద్‌గా,ప్రయాగ్‌రాజ్‌ను అలహాబాద్ గామార్చారు.కానీమా ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటి పాతగౌరవాన్ని తిరిగి తీసుకువచ్చాం అనివ్యాఖ్యానించారు.ఆయన ప్రకారం,ముస్తఫాబాద్ పేరు మార్పుతో ఆప్రాంతానికి కొత్తసాంస్కృతికగుర్తింపు లభిస్తుందని చెప్పారు.ముస్తఫాబాద్ గ్రామం లఖింపూర్ ఖేరిజిల్లా గోలా గోకరన్ నాథ్ తహసీల్ పరిధిలోఉంది.2011 జనాభాలెక్కల ప్రకారం,గ్రామంలో 77 కుటుంబాలు ఉండగా,మొత్తం జనాభా 495. వీరిలో ఎక్కువ మంది హిందూ సమాజానికి చెందినవారే ఉన్నారు.

# బాలికల టాయిలెట్‌లో రహస్య కెమెరాల కలకలం



**కరీంనగర్,అక్టోబర్28:**కరీంనగర్ జిల్లాలోని ఒక ప్రభుత్వ పాఠశాల బాలికల టాయిలెట్‌లో రహస్య కెమెరాలు ఉండటం తీవ్ర కలకలం సృష్టించింది.గంగాధర మండలంలోని కురిక్యాల జిల్లా పరిషత్ ప్రభుత్వపాఠశాలలో చదువుతున్న కొందరు బాలికలు సోమవారంతమవాష్‌రూమ్‌లోఅనుమానాస్పదంగా లైట్ వెలుగుతున్న ఒక పరికరాన్ని గుర్తించారు.అది రహస్య కెమెరా అని అనుమానించి వెంటనే తమ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.ఆగ్రహంతో పాఠశాలకు చేరుకున్న తల్లిదండ్రులు,స్కూల్ యాజమాన్యంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.పోలీసులు,అధికారులకు నివేదన విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ వెంటనే గంగాధర ఎస్సై వంశీకృష్ణ,చొప్పదండి సీఐ ప్రదీప్ కుమార్‌లకు సమాచారం అందించారు. పాఠశాలకు చేరుకున్న పోలీసులు,ఆధారాలు సేకరించి దర్యాప్తు ప్రారంభించారు.బాలికల భద్రత కోసం జిల్లా కలెక్టర్ ఇప్పటికే అన్ని పాఠశాలల్లో స్నేహిత క్లబ్స్ వంటివి ఏర్పాటు చేశారని,ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ మీడియాకు తెలిపారు.ఈ ఘటనపై జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర మహిళా,శిశు సంక్షేమ శాఖకు నివేదిక పంపినట్లు ఆయన వెల్లడించారు.గతంలోనూ ఇలాంటి ఘటనలు రహస్య కెమెరాల ఘటనలు జరగడం ఇది తొలిసారి కాదు.ఈ ఏడాది జనవరిలో బీఆర్ఎస్ మాజీ నేత మల్లారెడ్డికి చెందిన సీఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజీలోని హాస్టల్ బాత్రూమ్‌లలోనూ ఇలాంటి ఘటనే జరిగింది.అప్పట్లో క్యాంపస్‌ను సందర్శించిన రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నెరేళ్ల శారద,కాలేజీని మూసివేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని హామీ ఇచ్చారు. ఆ కేసులో నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసినప్పటికీ, కాలేజీ యాజమాన్యంపై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.ప్రైవేట్ కాలేజీలకు కొత్త నిబంధనలుకూడారూపొందించలేదు.

## పారాక్వాట్ గడ్డిమందును బ్యాన్ చేయాలి ఎందుకంటే


**హైదరాబాద్,అక్టోబర్28:**ఇటీవల తెలంగాణలో పారాక్వాట్ అనే ప్రమాదకర గడ్డిమందు వినియోగం పెరుగుతూ ఉండటం ఆందోళనకు గురిచేస్తోంది.పంటల్లో పెరిగే కలుపు మొక్కలను కొద్ది గంటల్లోనే పూర్తిగా మాడిపోయేలా చేసే ప్రభావంతో ఇది రైతుల్లో విస్తృతంగా ఉపయోగంలో ఉంది. ఒకవైపు పంటలకు ఉపయోగపడుతున్నా,మరోవైపు ఈ మందును తాగి ఆత్మహత్యలకు పాల్పడే ఘటనలు పెరగడం తీవ్ర విషాదకరం.వ్యవసాయ రంగంలో విస్తృతంగా లభిస్తున్నందున ఇది సులభంగా అందుబాటులో ఉండటం ప్రమాదాన్ని మరింత పెంచుతోంది.పారాక్వాట్ విషతత్వం అత్యంత ఘోరం.ఇది శరీరంలోకి చేరిన కొద్ది నిమిషాల్లోనే రక్త ప్రసరణ ద్వారా కిడ్నీలు,కాలేయం,ఊపిరితిత్తులు వంటి కీలక అవయవాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది.ఈ విషానికి ఇప్పటి వరకు విరుగుడు (అంటీడోట్) లేనందున బాధితులను కాపాడే అవకాశాలు చాలా తక్కువ.

# డ్రైవర్ నిరక్ష్యంపై పోలీసులకు పెరుగుతున్న అనుమానాలు



**కర్నూలు,అక్టోబర్28:**కర్నూలు సమీపంలో 19 మంది ప్రాణాలు కోల్పోయిన బస్సు ప్రమాదం కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.బస్సు డ్రైవర్‌లక్ష్మయ్య నిరక్ష్యంవల్లే ఈ మృత్యు ఘోరం జరిగిందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రమాదానికి ముందు కేవలం 10-15 నిమిషాల వ్యవధిలోనే అదే మార్గంలో ప్రయాణించిన 19 భారీ వాహనాలు రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను తప్పించుకుని వెళ్లాయని పోలీసులు గుర్తించారు.కానీ,అదే బైక్‌బస్సు డ్రైవర్‌కి ఎందుకు కనిపించలేదన్నేప్రశ్నలు తలెత్తుతున్నాయి.శుక్రవారం తెల్లవారుజామున చిన్నటేకూరు సమీపంలో ఇద్దరుయువకులు బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు.బైక్ రోడ్డు మధ్యలో పడిపోయిన దాదాపు పావుగంట తర్వాత బెంగళూరు వైపు వెళ్తున్న కావేరి ట్రావెల్స్ బస్సు ఆ బైక్‌పై దూసుకెళ్లింది.దాంతో బస్సు అగ్నికి ఆహుతై 19 మంది సజీవదహనమయ్యారు.డ్రైవర్ లక్ష్మయ్యను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా,అతని సమాధానాల్లోపొంతనలేమికనిపించింది.వర్షం, చీకటి కారణంగా బైక్ కనిపించలేదని చెప్పినా,సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా అతనివాదనపై పోలీసులు సందేహం వ్యక్తంచేశారు.బైక్ రోడ్డుపై పడివుండగా ఒక వ్యక్తి గాయపడిన సహచరుణ్ని పక్కకు లాగుతున్నాడు.మేము ఆ బైక్‌ను తప్పించుకునివెళ్లాం,అని ఆ సమయంలో ఆ మార్గంలో ప్రయాణించిన ఇతర డ్రైవర్లు పోలీసులకు వెల్లడించారు.ఈ వాంగ్మూలాలు కేసులో కీలకంగా మారాయి.ప్రస్తుతం పోలీసులు ఆర్టీఏ, ఫోరెన్సిక్,అగ్నిమాపక శాఖ నివేదికల కోసం ఎదురుచూస్తున్నారు.అవి అందిన తర్వాతే బాధ్యతలపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.ఇదిలా ఉండగా, ఈ ప్రమాదంలో మృతి చెందిన నెల్లూరు దంపతులు రమేశ్-అనూష పిల్లల అంత్యక్రియలకు వెళ్లిన వారి బంధువులు తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వరుస దుర్ఘటనలు ఆ కుటుంబంపై విషాద ఛాయలు మోపాయి.

## రోడ్డుపై దొరికిన నోట్ల కట్టలు.. నిజాయితీ చాటుకున్న మహిళ



**వాషింగ్టన్,అక్టోబర్25:**గుడిలో దేవుడిని దర్శించుకుని ఇంటికి తిరిగి వెళుతున్న ఓ మహిళకు రోడ్డుపై నోట్ల కట్టలతో ఉన్న బ్యాగు దొరికింది.ఆ బ్యాగులో అన్నీ రూ.500 నోట్ల కట్టలే కనిపించాయి. ఇంతటి ధనాన్ని చూసి కూడా చలించకుండా ఆ మహిళ ఆ బ్యాగును పోలీసులకు అప్పగించి తన నిజాయితీని చాటుకుంది.పోలీసులు ఆమె నిజాయతీని అభినందించారు.ఆలయం నుంచి ఇంటికి వెళుతుండగా.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,మధురై సిమ్మక్కల్ ప్రాంతానికి చెందిన సెల్వమాలిని అనే మహిళ మధురై మీనాక్షి అమ్మవారిఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఆదివారం రాత్రి ఆమె ఆలయం నుంచి ఇంటికి వెళుతుండగా రోడ్డు మధ్యలో ఒక సంచి కనిపించింది.ఆ సంచిని పక్కకు తీయాలనే ఉద్దేశంతో దగ్గరకువెళ్లగా,అందులో నోట్లకట్టలు కనిపించాయి.వెంటనే ఆమె సమీపంలో భద్రతా విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఆ సంచీని తీసుకెళ్లి అప్పగించింది.రూ.17.5 లక్షల నగదుసెల్వమాలిని ముందే ఆ సంచిని తెరిచి, పోలీసులు నోట్ల కట్టలను లెక్కించగా అందులో మొత్తం రూ.17.5 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించారు. అంత భారీ మొత్తంలో నగదు ఉన్నప్పటికీ,చలించకుండా తీసుకొచ్చి తమకు అప్పగించిన సెల్వమాలిని నిజాయతీని పోలీసులు కొనియాడారు.కాగా,ఆ నోట్ల కట్టల బ్యాగు ఎవరిది, అక్కడ ఎందుకు ఉందనే వివరాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# జేడీయూ షాక్ నిర్ణయం: 16 మంది నేతలకు బహిష్కరణ



**న్యూఢిల్లీ, అక్టోబర్ 27:**బీహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని జనతా దళ్ యునైటెడ్ (జేడీయూ) పార్టీలో తిరుగుబాటు స్వరాలు వినిపిస్తున్నాయి.పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై ఒక సిట్టింగ్ ఎమ్మెల్యేతో పాటు మొత్తం 16 మంది సీనియర్ నాయకులను పార్టీ నుండి బహిష్కరించింది.ఈ మేరకు జేడీయూ జాతీయ అధ్యక్షుడు అధికారిక ఉత్తర్వులుజారీచేశారు.మాజీమంత్రులు,ఎమ్మెల్యేలు జాబితాలో బహిష్కరించ బడినవారిలో ఇద్దరు మాజీమంత్రులు,పలువురు మాజీ ఎమ్మెల్యేలు,అలాగే జిల్లా స్థాయి అధ్యక్షులు ఉన్నారు.వీరిలో చాలా మంది ఎన్డీఏ అధికారిక అభ్యర్థులకు వ్యతిరేకంగా స్వతంత్రంగా లేదా ఇతరపార్టీల తరఫున పోటీ చేయాలని ప్రకటించినవారేనని సమాచారం.పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనగా జేడీయూ స్పష్టం జేడీయూ నేతృత్వం ఈ తిరుగుబాటుచర్యలను పార్టీక్రమశిక్షణకు విరుద్ధమని పేర్కొంది.కూటమినిర్ణయాలను విస్మరించి,ఎన్డీఏ అభ్యర్థులకు వ్యతిరేకంగా వ్యవహరించడం పార్టీ నియమావళి ఉల్లంఘనగా పరిగణించబడుతుందని స్పష్టంచేసింది.ఎన్నికల ముందు కఠినసందేశం రాష్ట్రంలో ఎన్నికలకోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో, మొదటిదశ పోలింగ్‌కు ముందుపార్టీలో క్రమశిక్షణను కాపాడటానికి, తిరుగుబాటుదారులకు గట్టి హెచ్చరిక ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం.బహిష్కరించబడిన నాయకులలో కొందరు ఇప్పటికే ఇతర పార్టీలతరఫున లేదా స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసినట్టు తెలుస్తోంది.పార్టీ శ్రేణులకు స్పష్టమైన సంకేతంజేడీయూ ఈ నిర్ణయం ద్వారా ఎన్నికల ముందు తన శ్రేణులకు స్పష్టమైన సందేశం పంపింది పార్టీ వ్యతిరేక చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోవని.ఈ చర్యతో రాష్ట్ర రాజకీయ వాతావరణం మరింత ఉత్కంఠతరం కానుంది.

# హైదరాబాద్ యువతను వెంటాడుతున్న వింత కిడ్నీ వ్యాధి



**హైదరాబాద్,అక్టోబర్28:**హైదరాబాద్ యువతలో ఒక కొత్త కిడ్నీ వ్యాధి భయాందోళన రేపుతోంది. డయాబెటిస్ లేదా అధిక రక్తపోటు లేకపోయినా కిడ్నీలు తీవ్రంగా దెబ్బతింటున్న ఈ వ్యాధిని వైద్యులు 'క్రానిక్ కిడ్నీ డిసీజ్ ఆఫ్అన్నోన్ ఎటియాలజీ అని పిలుస్తున్నారు.గతంలో ఇదిగ్రామీణప్రాంతాల్లో మాత్రమేకనిపించేది.వ్యవసాయ పనులు,ఎండలో పనిచేయడం,డీహైడ్రేషన్, రసాయనాల ప్రభావం వంటి కారణాలు చూపించేవారు.కానీ ఇప్పుడు ఈ వ్యాధిపట్టణ యువతలో వేగంగా వ్యాపిస్తోంది.ముఖ్యంగా చిన్నవ్యాపారాలు, సర్వీస్ రంగాల్లో పనిచేస్తున్న 20 నుంచి 30 ఏళ్ల వయసు వారు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతున్నారు.వ్యవసాయానికి సంబంధం లేనివారిలోనూ ఇది కనిపించడం వైద్యులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.పరిశోధనల్లో హెర్బల్ మరియు సంప్రదాయ ఔషధాల వాడకం ప్రధాన కారణమై ఉండొచ్చని తేలింది.హైదరాబాద్‌లో కేసులలో 40 శాతం మంది ఇలాంటి మందులు వాడినట్లు గుర్తించారు.వీటిలో కిడ్నీలను నెమ్మదిగా దెబ్బతీసే రసాయనాలు ఉన్నాయని నిపుణులు సూచిస్తున్నారు. ఈ వ్యాధి ప్రారంభంలో ఎలాంటి లక్షణాలు లేకపోవడం వల్ల,గుర్తించే సమయానికి కిడ్నీలు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటాయి.చేతులు,కాళ్లవాపు,నీరసం,ఆకలి తగ్గడం,శ్వాసలో ఇబ్బంది, చర్మం పొడిబారడం వంటి లక్షణాలు బయటపడే సమయానికి డయాలసిస్ లేదా కిడ్నీమార్పిడి తప్ప మరోమార్గం ఉండదు.అందుకేచిన్నపాటిఅసాధారణ లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించడంఅత్యంతఅవసరం.

# ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన రియాజ్..హక్కుల కమిషన్ ఆశ్రయించిన కుటుంబం

**నిజామాబాద్,అక్టోబర్28:**రియాజ్ ఎన్‌కౌంటర్‌పై కుటుంబ సభ్యుల ఆవేదన నిజామాబాద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన షేక్ రియాజ్ కుటుంబ సభ్యులు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సమీపించారు.రియాజ్ తల్లి, భార్యమరియు పిల్లలు కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షామీమ్ అక్తర్‌కు మృతికి దారితీసిన పరిస్థితులు మరియు ఎన్‌కౌంటర్ తర్వాత పోలీసులు చేపట్టిన వేధింపుల గురించి ఫిర్యాదు చేశారు.కుటుంబ సభ్యులు తమను స్వంత గ్రామంలోకి కూడా ప్రవేశించనీయకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని మరియు తీవ్రమైన మానసిక వేధింపులకు గురి చేయడం జరుగుతున్నట్లు ఆరోపించారు.ఆర్థిక వివాదం మరియు వేధింపుల ఆరోపణలు కుటుంబ సభ్యులు చేసిన షాకింగ్ దావాలలో,మరణించిన కానిస్టేబుల్ ప్రమోద్‌కు రియాజ్ నుండి ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు వివరించారు.ఒక కేసు విషయంలో ప్రమోద్ రూ.3 లక్షలు డిమాండ్ చేసినట్లు మరియు రియాజ్ తప్పనిసరి పరిస్థితుల్లో రూ.30,000 మాత్రమే చెల్లించగలిగినట్లు కుటుంబం ఆరోపించింది. మిగతా డబ్బులు చెల్లించమని ప్రమోద్ రియాజ్‌ను నిరంతరం వేధించారని రియాజ్ భార్య తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె తమ కుటుంబాన్ని గ్రామంలోకి రాకుండా పోలీసులు నిరోధిస్తున్నారని కూడా ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఎన్‌కౌంటర్ ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్వయంచాలకంగా కేసు స్వీకరించింది. కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షామీమ్ అక్తర్ ఈ విషయంలో సమగ్ర నివేదికను నవంబర్ 3వ తేదీలోపు సమర్పించాలని రాష్ట్ర డీజీపీకి ఆదేశాలు జారీ చేశారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని,ముందు నిర్ణయించిన నవంబర్ 24 నుండి నివేదిక సమర్పణ గడువును గణనీయంగా తగ్గించడం జరిగింది.ఈ తీర్పుతో,పోలీసులు త్వరితగతిన నివేదిక సమర్పించవలసిన అవసరం ఏర్పడింది.

# బాలుడిని హతమార్చిన ఆటోడ్రైవర్

**హైదరాబాద్,అక్టోబర్28:**తన భార్య తనను వదిలి వెళ్లిపోవడానికి ఓ మహిళ కారణమని భావించిన ఒకిరాతకుడు ఆమెఐదేళ్ల కుమారుడినిహతమార్చాడు. ఎవరోఏదో చెబితే ఆ మాటల్ని వినేసి,బంధాలను తెంపుకునేవెర్రివెంగళప్పలు ఎవరూ ఉండరు.వివాహం అంటే నూరేళ్ల పంట. జీవితాంతం కలిసి బతికేందుకు పెళ్లి అనే రెండక్షరాల బంధంతో ఒక్కటైన జంట ఏ పక్కింటి పుల్లమ్మనో వెనికింటి ఎల్లమ్మనో చెబితే మొగుణ్ణి వదిలేసి వెళ్లేవారు ఉండరు. అలా భ్రమించి, ఎదుటివారికి తీరని అన్యాయం చేస్తుంటారు.తాజాగా ఓ ఆటోడ్రైవర్‌కూడా సరిగ్గాఇదే చేసి, ఆ తల్లికి కడుపుకోతను మిగిల్చాడు.గొంతు నులిమి చంపిన కిరాతకుడు అనంతపురంలోని అరుణోదయ కాలనీలో ఉండే గోవిందు హరి,నాగవేణి దంపతుల చిన్న కుమారుడు సుశాంత్ (5)ను కిడ్నాప్ చేశాడు ఆటోడ్రైవర్ పెన్నయ్య.ఇంట్లో ఎవరూ లేనిసమయంలో లోపలికి దూరి బాలుడిని సంచిలో కిడ్నాప్ చేశాడు.అనంతరం గొంతు నులిమి హతమార్చాడు.తర్వాత మృతదేహాన్ని కంపచెట్ల మధ్యలో విసిరేసి, తనకు ఏమీ తెలియదు అన్నట్లుగా ఇంటికి చేరుకున్నాడు పెన్నయ్య.కాగా తల్లి నాగవేణి అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లింది.ఇంటికి వచ్చేసరికి సుశాంత్ కనిపించకపోవడంతో,పక్క ఇంట్లో ఉండే నాయనమ్మ దగ్గర పడుకున్నాడని తల్లిదండ్రులుహరి,నాగవేణి భావించారు.అయితే ఉదయం అయినా బాలుడు కనిపించక పోవడంతో కంగారుపడి, పోలీసులకు ఫిర్యాదు చేశారు.తమకు ఆటోడ్రైవర్ పెన్నయ్యపై అనుమానం ఉందని చెప్పడంతో పోలీసులుఅతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో తానే ఈ హత్య చేసినట్లు నిందితుడు


## అతలాకుతలం చేస్తున్న తుఫాన్

>>తీసివేయాలి.ముఖ్యమైన డాక్యుమెంట్లు మరియు విలువైన వస్తువులను నీటి ప్రవేశాన్ని నిరోధించే కంటైనర్లలో భద్రపరచాలి.పాత భవనాలు,పెద్ద చెట్లు మరియు విద్యుత్ స్తంభాల వద్ద ఉండకుండా జాగ్రత్తపడాలి.అత్యవసర సహాయం కోసం 112,1070,మరియు 1800 425 0101 నంబర్లలో సంప్రదించవచ్చు.

## ఖాతాల్లోకి రూ.2 వేల జమా!

>>21వ విడత విడుదలకు ముందు రైతులు రెండు ముఖ్యమైన ప్రక్రియలను పూర్తి చేయాలి:ధృవీకరణ:పీఎం కిసాన్ పోర్టల్ ద్వారా లేదా సమీప ద్వారా పూర్తి చేయాలి.రైతులు ఆధార్ మొబైల్ నంబర్ ద్వారా లేదాయాప్‌లోని ఉపయోగించి కూడా చేయవచ్చు.భూమి ధృవీకరణ:రైతులు తమభూమి రికార్డులనురాష్ట్ర రెవెన్యూ పోర్టల్ ద్వారా ధృవీకరించాలి.భూమి వివరాల్లో పొరపాట్లు లేదా వ్యత్యాసాలు ఉంటే సకాలంలో సరిచేయాలి.ఈ రెండు ప్రక్రియల్లో ఏదైనా అసంపూర్ణంగా ఉంటే,నిధుల చెల్లింపు ఆలస్యం అవ్వడం లేదావాయిదా నిలిపివేయబడే అవకాశం ఉంది.21వ విడత విడుదల సమయం గత విడత ఆగస్టులో రైతుల ఖాతాల్లో జమ కాగా,తదుపరి విడత నవంబర్ మొదటి లేదా రెండోవారంలో విడుదల అయ్యే అవకాశంఉంది. ప్రభుత్వంఇప్పటికే వరదల ప్రభావిత రాష్ట్రాలకు ముందుగానే నిధులను పంపింది.మిగతా రాష్ట్రాల రైతులకు కూడా నవంబర్‌లోనే నిధులు చేరనున్నట్లు అంచనా.ముఖ్య సూచనలు మరియు భూమి ధృవీకరణ పూర్తి చేసిన రైతులకు మాత్రమే నిధులు జమ అవుతాయి.ఆధార్ లింక్ చేయని లేదా బ్యాంకు వివరాలు తప్పుగా ఉన్న ఖాతాలకు చెల్లింపులు ఆలస్యం కావచ్చు.ఇప్పటి వరకు ఈ పథకం కింద రైతులకు 3 లక్షల కోట్లకు పైగా నిధులు పంపిణీ అయ్యాయి.

## 3 రాష్ట్రాల్లో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ ఏర్పాటు



**న్యూఢిల్లీ,అక్టోబర్28:**ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల రంగానికి మరొక పెద్దశుభవార్త.కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కాంపోనెంట్ పథకం కింద రాష్ట్రంలో భారీ స్థాయిలో ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమ స్థాపనకు ఆమోదం లభించింది.రూ.765 కోట్ల పెట్టుబడితో ఏర్పడనున్న ఈ యూనిట్,రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి మరో కొత్త ఊపిరిని తీసుకొస్తుంది. ముఖ్యంగా,ఈ ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 955 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుంది.కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించిన వివరాల ప్రకారం,మూడు రాష్ట్రాల్లో మొత్తం 7 ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఈ ప్రాజెక్టుల విలువ రూ.5,500 కోట్లు,వీటి ద్వారా 36,559 కోట్ల విలువైన ఎలక్ట్రానిక్‌ఉత్పత్తులు తయారు చేయబడతాయి. అదేవిధంగా,మొత్తం5,100 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు.



## విషాదంగా మారిన పండుగ

### ఆనందం..ముగ్గురు చిన్నారులు మృతి



దేశవ్యాప్తంగా ప్రజలు ఛఠ్ పూజను అంగరంగ వైభవంగా జరుపుకుంటున్న ఈ క్రమంలో, జార్ఖండ్‌లోని హజారీబాగ్ మరియు గర్వా జిల్లాల్లో విషాదకరమైన ప్రమాదంచోటు చేసుకుంది. ముగ్గురు అమాయక పిల్లలునీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. పండుగ పూట సరదాగా ఉండాల్సిన పిల్లలు మరణించడంతో మృతుల కుటుంబాల్లోతీవ్రవిషాదంనెలకొంది. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. హజారీబాగ్‌లో ఇద్దరు బాలికల మృతి హజారీబాగ్‌లోని కెరెదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోనిబేలా గ్రామానికి చెందిన 11 ఏళ్ల గుంగున్ కుమారి,12 ఏళ్ల రూపా తివారీ ఛఠ్ పూజ వేడుకల సందర్భంగా చెరువులో స్నానం చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. లోతైన నీటిలోకి దిగిన ఈ ఇద్దరు బాలికలు నీటి ప్రవాహానికి మునిగిపోయారు. వారు సహాయం కోసం కేకలు వేసినా,కుటుంబ సభ్యులు మరియు స్థానికులు ఎంత ప్రయత్నించినా వారిని రక్షించలేకపోయారు. కుటుంబ సభ్యులు బయటకు తీసే సమయానికే ఇద్దరూ మరణించారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను పోస్టుమార్టం కోసం పంపారు. గర్వా జిల్లాలో బాలుడి మరణం జార్ఖండ్‌లోని గర్వా జిల్లాలో కూడా సోమవారం మధ్యాహ్నం ఇలాంటి విషాదకరమైన సంఘటన జరిగింది. అక్కడ డాన్రో నదిలో స్నానం చేస్తూ 3ఏళ్ల రాహుల్‌కుమార్ మునిగిమరణించాడు. చిన్నారి నదిలోస్నానం చేయడానికి వెళ్లి,ఆడుకుంటూ లోతైన నీటిలోకి బయటకు రాలేకపోయాడని పోలీసులు తెలిపారు.

## భారీ వర్షాల తర్వాత పంట సంరక్షణ చిట్కాలు



**హైదరాబాద్,అక్టోబర్25:** భారీ వర్షాలు కురిసిన తర్వాత పంటల నీటిలో మునిగిపోవడం సాధారణం. ముఖ్యంగా మెట్టపంటలు(ఉదా:వరి, మక్కజొన్న,పత్తి,పప్పుధాన్యాలు) ముంపునకు గురైతేరైతులు వెంటనేతగినచర్యలు తీసుకోవాలి ఆలస్యం చేస్తే మొక్కలు ఆక్సిజన్ లోపంతో ఎండిపోవడం,తెగుళ్ల వ్యాపించడం,దిగుబడి తగ్గడం వంటి సమస్యలు వస్తాయి. ముంపు నీటిని తొలగించడం అత్యవసరం పొలంలో నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ ఏర్పాట్లు చేసి వెంటనే నీటిని బయటకు పంపాలి. ఎక్కువసేపు నీరు నిలిస్తే మొక్కల వేర్లు కుళ్లిపోవడం ప్రారంభమవుతుంది. నేల ఎండిన తర్వాత తేలికగా ఎరువులు మరియు ఫంగిసైడ్లు వాడాలి. పంటలకు పోషకాహారం (బూస్టర్ డోస్) నీటిముంపు తర్వాత పంటలకు పోషక లోపం తలెత్తుతుంది. అందుకే పంటను తిరిగి చైతన్యవంతం చేయడానికి ఎకరాకు:యూరియా–25 కిలోలు పొటాష్–10 కిలోలు ఈ ఎరువులను మొక్కల మొదళ్ల చుట్టూ వేయాలి. పిచికారీ తర్వాత రెండు రోజులు నీరు నిల్వ ఉండకుండా చూడాలి. తెగుళ్ల నియంత్రణ ముంపు తర్వాత శిలీంద్రతెగుళ్లవేగంగావ్యాపిస్తాయి. ఆకుమచ్చలు, పొడి,పూతలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఫంగిసైడ్ పిచికారీ చేయాలి. హెక్సాకోనజోల్–2 గ్రాములు/లీటర్ నీరు లేదా కార్బండిజమ్–1 గ్రాము/లీటర్ నీరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పిచికారీ తర్వాత 2–3 రోజుల పాటు వర్షంలేకుండా చూసుకోవడంమంచిది. రైతులకు నిపుణుల సూచనలు స్థానికవ్యవసాయఅధికారులనులేదా రైతుసలహా కేంద్రాలను సంప్రదించాలి. పంట రకం,నేల పరిస్థితి,వర్ష పరిమాణం ఆధారంగా వారి సూచనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అవసరమైతే మైక్రోన్యూట్రియంట్ స్ప్రేలు లేదా హార్మోన్ స్ప్రేలు వాడి మొక్కల వృద్ధిని వేగవంతం చేయవచ్చు.

## తుఫాను ప్రభావిత జిల్లాల్లో రేషన్ పంపిణీ ప్రారంభం



**విజయవాడ, అక్టోబర్28:**తుఫాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జిల్లాల ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణ సహాయ చర్యలు చేపట్టింది. రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటన ప్రకారం, ఈరోజు నుంచే రేషన్ పంపిణీ ప్రారంభమవుతోంది. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, కోనసీమ, పశ్చిమ గోదావరి ,కృష్ణా, బాపట్ల, కాకినాడ, నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో రేషన్ లబ్ధిదారులకు సరుకులు అందజేయడం జరుగుతుంది. ఇక తుఫాను ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ జిల్లాల్లో వచ్చే మూడు రోజుల పాటు పెట్రోల్, డీజిల్‌కొరత రాకుండా ఆయిల్ కంపెనీలతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే తుఫానుప్రభావితప్రాంతాల్లోరహదారి, విద్యుత్, తాగునీటి పునరుద్ధరణ పనులను వేగవంతం చేస్తోంది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రి స్పష్టం చేశారు.

# శ్రేయాస్ అయ్యర్ క్షేమంగా ఉన్నారు: బీసీసీఐ క్లారిటీ



**న్యూఢిల్లీ, అక్టోబర్28:**శ్రేయాస్ అయ్యర్ ఆరోగ్యంపై తాజా సమాచారం బయటకు వచ్చింది. ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో క్యాచ్ ప్రయత్నం చేస్తూ గాయపడ్డ శ్రేయాస్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించారు. గాయంతో అంతర్గత రక్తస్రావం జరిగిన కారణంగా వైద్యులు ఆయనను ఐసీయూలో చేర్పించారు. కొంతసేపు పరిస్థితి ఆందోళన కలిగించినా, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని సమాచారం. బీసీసీఐ ప్రకారం, అయ్యర్ ప్రాణానికి ఎలాంటి ప్రమాదం లేదని, ఆయన ఐసీయూ నుంచి బయటకు వచ్చినట్లు ధృవీకరించారు. వైద్యుల పర్యవేక్షణలో శ్రేయాస్ ఇంకా ఆసుపత్రిలోనే ఉన్నాడు. పూర్తిగా కోలుకోవడానికి కనీసం రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉందని వైద్యులు అంచనా వేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం, అయ్యర్ డిశ్చార్జ్ అయ్యేందుకు ఇంకా కొంత సమయం పడుతుంది. బీసీసీఐ ఆయన తల్లిదండ్రులు సిడ్నీకి వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం అయ్యర్ పరిస్థితి స్థిరంగా ఉన్నప్పటికీ, ఆయన డిసెంబర్‌లో జరగనున్న భారత్ దక్షిణాఫ్రికా వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉండే అవకాశం తక్కువగా ఉంది. అయితే, జనవరి నెలలో జరగబోయే భారత్‌న్యూజిలాండ్ వన్డే సిరీస్ నాటికి అయ్యర్ పూర్తిగా కోలుకుని మైదానంలోకి తిరిగి వచ్చే అవకాశం ఉందని జట్టు వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## ఓటీటీ లో కి వచ్చేస్తున్నా ది ఫ్యామిలీ మ్యాన్ 3




**ముంబై,అక్టోబర్28:** దేశవ్యాప్తంగా ఆడియెన్స్‌ను అలరించిన ది ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్ మూడో సీజన్‌తో త్వరలో మన ముందుకు రాబోతోంది. ఈ సీజన్‌ను అమెజాన్ ప్రైమ్ వీడియోలో నవంబర్ 21 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. మొదటి రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ శ్రీకాంత్ తివారీగా నటనకు ప్రేక్షకుల నుండి విశేష అభినందనలు లభించాయి. మూడో సీజన్‌లో ఆయన ఎలాంటి కొత్త సవాళ్లను ఎదుర్కోబోతున్నారనే ఆసక్తి ప్రేక్షకులలో నెలకొంది. బీసీసీఐపై ఐసీసీ మాజీ రిఫరీ సంచలన ఆరోపణలు ఓటీటీ లో కి వచ్చేస్తున్నా ది ఫ్యామిలీ మ్యాన్ 3 కొత్త ప్రాంతం, కొత్త విరోధి మూడో సీజన్ కథ ఈశాన్య రాష్ట్రాల నేపథ్యంలో సాగనుంది. ఇందులో పాతాళ్ లోక్ సిరీస్ ద్వారా గుర్తింపు పొందిన జైదీప్ అహ్లావత్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనుండటం ఫ్యాన్స్ కోసం పెద్ద ఆకర్షణ. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో సిరీస్ ఒకేసారి రిలీజ్ కానుంది. రాజ్ డీకే ద్వయం ఈ సీజన్‌కు కూడా దర్శకత్వం వహించారు.

## ఆత్మహత్య చేసుకున్న బాలీవుడ్ యువనటుడు



**బాలీవుడ్, అక్టోబర్28:**బాలీవుడ్ చిత్ర పరిశ్రమలో మరోసారి విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ వెబ్ సిరీస్ జమ్తారా 2 ద్వారా గుర్తింపు పొందిన యువనటుడు సచిన్‌చాంద్‌వడే (25) ఆత్మహత్య చేసుకోవడం సినీ వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఈఘటన అక్టోబర్ 23న జరిగినప్పటికీ, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిన్నవయసులోనే ప్రతిభను చూపించిన ఈ యువనటుడు ఇలాజీవితాన్ని ముగించు కోవడం అభిమానులను, సినీ వర్గాలను కలచివేసింది. వివరాల్లోకి వెళ్తే సచిన్ చాంద్‌వడే మహారాష్ట్రలోని ఉందిర్‌ఖేడ్ ప్రాంతంలో తనకుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. అక్టోబర్ 23నఉదయం సచిన్‌తన ఇంట్లోనేఆత్మహత్యకు ప్రయత్నించారు. ఆ సమయంలో ఇంట్లోఉన్న కుటుంబ సభ్యులు గమనించివెంటనే అతడిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆయన ఇంతటి తీవ్ర నిర్ణయం ఎందుకు తీసుకున్నారనే విషయంపై స్పష్టత లేదు అక్కడ చికిత్స పొందుతున్నప్పటికీ, పరిస్థితి విషమించడంతో మరుసటి రోజు ఆయన తుదిశ్వాస విడిచారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన సచిన్, నటనపై ఆసక్తితో చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారు. జమ్తారా 2 వెబ్‌సిరీస్‌లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కెరీర్‌లో ఎదుగుతున్న సమయంలో ఆయన ఇంతటి తీవ్ర నిర్ణయం ఎందుకు తీసుకున్నారనే విషయంపై స్పష్టతలేదు. ఆత్మహత్యకు గలకారణాలు తెలియాల్సి ఉంది. సచిన్ మృతితో ఆయన కుటుంబంలో, బాలీవుడ్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి

## పిల్లల ఆరోగ్యానికి బీట్‌రూట్ ఎందుకు అవసరం?



బీట్‌రూట్ పిల్లల ఆరోగ్యానికి ఒక అద్భుతమైన సూపర్ ఫుడ్‌గా పరిగణించబడుతుంది. ఇందులో ఉండే ఫోలేట్, ఐరన్, మాగ్నీషియం, విటమిన్ సి వంటి పోషకాలు రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. ఇది పిల్లల మెదడు అభివృద్ధికి సహకరించి, చదువు పై దృష్టి కేంద్రీకరణను పెంచుతుంది. బీట్‌రూట్‌లో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని హానికర రసాయనాలను బయటకు పంపి ఇమ్యూనిటీని బలపరుస్తాయి. పిల్లలజీర్ణవ్యవస్థను సక్రమంగా పనిచేయించడంలో కూడా బీట్‌రూట్ ప్రధానపాత్ర పోషిస్తుంది. ఇందులో ఉన్న ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచి, మలబద్ధకం సమస్యను నివారిస్తుంది. బీట్‌రూట్‌లో సహజ చక్కెరలు ఉండటం వల్ల శక్తిని అందించడంతో పాటు పిల్లలలో అలసటను దూరం చేస్తుంది. బీట్‌రూట్‌ను వివిధ రకాలుగా పిల్లలకు ఇవ్వవచ్చు ఉదయం జ్యూస్‌గా, మధ్యాహ్నభోజనంలో సలాడ్‌గా, లేదా సాయంత్రం స్నాక్స్‌లో సూప్ రూపంలో. చిన్న పిల్లలకు బీట్‌రూట్ ప్యూరీగా లేదా చపాతీతో కలిపి ఇవ్వవచ్చు.

## నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం

**వరంగల్, అక్టోబర్28:**దేశంలో మహిళలకు భద్రత కొరవడుతున్నది. స్త్రీలపై అఘాయిత్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పసిబిడ్డల నుంచి వృద్ధుల వరకు వదలిపెట్టడం లేదు. ఒంటరిగా కనిపిస్తే చాలు కామాంధులకు బలైపోతున్నారు. దేశంలో ప్రతిరోజు పదుల సంఖ్యలో అత్యాచారాలు జరుగుతుండడం బాధాకరం. నెలలపసికందుల నుంచి 70ఏళ్లముసలి వారిపై లైంగికదాడులు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా నాలుగేళ్ల చిన్నారిపై అంగన్వాడీ ఓటీచర్ కుమారుడు(16)అత్యాచారానికిపాల్పడ్డాడు. వరంగల్‌జిల్లా ఖానాపురం మండలంలోని ఒక తండాలో తన ఒతల్లి తన నాలుగేళ్ల కూతురు (4)ని తల్లి వద్ద వదిలేసి, బతుకుదెరువు కోసం హైదరాబాద్ వలస వెళ్లింది. ఎప్పటిలాగే చిన్నారి అంగన్వాడీ కేంద్రానికి వెళ్లింది. అయితే టీచర్ బయటకి వెళ్లిన సమయంలో టీచర్ కుమారుడు(16) చిన్నారిని పక్కగదిలోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. చిన్నారికి స్నానం చేయించే క్రమంలో ఆమె బట్టలపై రక్తం, ఒంటిపైగాయాలు గమనించిన అమ్మమ్మ తనకూతురునికి సమాచారం ఇచ్చింది. దీంతో హుటాహుటిగా ఇంటికొచ్చిన తల్లి తన బిడ్డపై జరిగిన లైంగిక దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# తదుపరి టోర్నీలకు పీవీ సింధు దూరం



**న్యూఢిల్లీ, అక్టోబర్28:**భారత బ్యాడ్మింటన్ పీవీ సింధు మరోసారి ప్రధాన వార్తల్లో నిలిచింది. ఒలింపిక్స్ లో రెండు పతకాలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్‌సహా అనేక విజయాలతో తనప్రతిభను నిరూపించుకున్న ఈ క్రీడాకారిణి ఇటీవల సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఏడాది మిగిలిన అన్ని తీజూనీ టోర్నీల నుండి విరామం తీసుకుంటున్నట్లు ప్రకటించింది. దీనికి కారణంగా పాద గాయం నుంచి పూర్తిగా కోలుకోవడమే ప్రాథమిక లక్ష్యం అనిఆమె తెలిపింది. గాయం నుంచి పూర్తిస్థాయి కోలుకోవడమే లక్ష్యం పాదం గాయం నుంచి పూర్తిగా కోలుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని పేర్కొంది. తన టీమ్‌తో సంప్రదింపులు జరిగిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నానని వెల్లడించింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్‌ను పంచుకుంది, ప్రముఖ డాక్టర్ పార్థివాలాతో పాటు నా టీమ్ సూచనలతో ఈ ఏడాదిలో మిగిలిన అన్ని బీడబ్ల్యూఎఫ్ టోర్నీల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను. యూరోపియన్ టోర్నీకి ముందు అయిన పాదం గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. టోర్నీలకు దూరంగా ఉండటం కాస్త కష్టమే. కానీ గాయాలు ప్రతి క్రీడాకారుడి జీవితంలో భాగమే. అవి అథ్లెట్ల పట్టుదల సహనాన్ని పరీక్షిస్తాయి. మరింత బలంగా తిరిగి రావాలనే కసిని కూడా కలిగిస్తాయి. రికవరీ ట్రైనింగ్ ఇప్పటికే మొదలైంది. కృతజ్ఞతతో మరింత ఉత్సాహంగా ఉన్నా డాక్టర్ వేన్ లంబార్డ్ పర్యవేక్షణలో నిషా రావత్ సాయం, నా కోచ్ ఇర్వాన్ స్యా గైడెన్స్‌లో కోలుకుంటున్నాను. నాపై వారికున్న నమ్మకం నా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తోంది. రాబోయే రోజుల కోసం ప్రేరణ, కృతజ్ఞతతో మరింత ఉత్సాహంగా ఉన్నాను. మీ ప్రేమ, మద్దతుకు ధన్యవాదాలు. ఇది మాటల్లో చెప్పలేనంత విలువైనది, అని పీవీ సింధు పేర్కొంది. చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నీ తర్వాత సింధు మళ్లీ కోర్టులోకి అడుగుపెట్టలేదు. ఈ టోర్నీలో సింధు సెమీస్‌కే పరిమితమైంది. సింధు తాజానిర్ణయంతో ఆర్కిటెక్ ఒపెన్, డెన్మార్క్ ఒపెన్, ఫ్రెంచ్ ఒపెన్‌కు దూరం కానుంది. తన మునపటి ఫామ్‌లోకి తిరిగొచ్చే సంకేతాలను ఇచ్చింది. 30 ఏళ్ల సింధు తన కోచ్ ఇర్వాన్ స్యాతో జతకట్టిన తర్వాత అత్యుత్తమ ప్రదర్శన కనబర్చింది. తన మునపటి ఫామ్‌లోకి తిరిగొచ్చే సంకేతాలను ఇచ్చింది. రికవరీకి టైమ్ కేటాయించాలని, వరుసటోర్నీలు ఆడవద్దనిబ్యాడ్మింటన్‌అకాడమీకోచ్‌లుప్రకాష్‌పదుకొణె, విమల్ కుమార్ ఇచ్చిన సలహాలను సింధు పరిగణలోకి తీసుకుంది. పారిస్ వేదికగా ఈ ఏడాది జరిగిన వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో సింధు వలర్డ్ నెంబర్ 2 వాంగ్ జీ ఈని ప్రీ క్వార్టర్‌లో ఓడించింది. కానీ పుత్రి కుసుమ వార్దని చేతిలో ఓటమిపాలైంది. ఇటీవల కాలంలో టైటిల్స్ గెలవడంలో సింధు తడబడుతుంది. ఆమె చివరి సారిగా లక్నో వేదికగా జరిగిన సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ సూపర్ 300 టైటిల్ గెలిచింది.

## బీసీసీఐపై ఐసీసీ మాజీ రిఫరీ సంచలన ఆరోపణలు




**టాలీవుడ్, అక్టోబర్25:** భారత్‌ను కాపాడమని ఫోన్ కాల్ వచ్చింది అనిఐసీసీ మాజీ మ్యాచ్ రిఫరీ క్రిస్ బ్రాడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. టీమిండియాపై జరిమానా విధించకుండా ఉండేందుకు రాజకీయ ఒత్తిడి తెచ్చారని ఆయన ఆరోపించారు. స్లో ఓవర్ రేట్ కారణంగా భారత్‌కు జరిమానా విధించే పరిస్థితి ఏర్పడగా, ఆ సమయంలో తనకు ఒక ఫోన్ కాల్ వచ్చిందని బ్రాడ్ వెల్లడించాడు. భారత జట్టుపై కొంత సౌమ్యంగా వ్యవహరించండి. జరిమానా పడకుండా చూడండి" అని ఆ కాల్‌లో చెప్పారని ఆయన అన్నారు. బీసీసీఐ నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా మ్యాచ్ సమయాన్ని సవరించి, భారత జట్టు జరిమానా నుంచి తప్పించుకున్నట్లు ఆయన వివరించాడు. ఇంగ్లండ్ మాజీ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ తండ్రి అయిన క్రిస్‌బ్రాడ్, ది టెలిగ్రాఫ్‌తో మాట్లాడుతూ, భారత్‌వద్దే డబ్బు ఎక్కువగా ఉంది. ఇప్పుడు వారు ఐసీసీపై కూడా ప్రభావం చూపుతున్నారు. అందుకేనేను ఆపదవిలో లేకపోవడం సంతోషంగాఉంది. క్రికెట్‌లో రాజకీయాలు గణనీయంగా పెరిగిపోయాయి' అని వ్యాఖ్యానించాడు. తరువాత జరిగిన మరో మ్యాచ్‌లో కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైందని ఆయన గుర్తుచేశారు. మరుసటి మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ సమస్య మళ్లీ వచ్చింది. నేనుఇచ్చిన హెచ్చరికలను సౌరవ్‌గంగూలీ పెద్దగా పట్టించుకోలేదు. అప్పుడు నేను మళ్లీ ఫోన్ చేసి సూచనలు అడిగాను. దానికి ఈసారి ఫైన్ వేయండి అని సమాధానం వచ్చింది. అప్పుడునుంచే ఈవ్యవస్థలో రాజకీయాలు ఉన్నాయని నాకు స్పష్టమైంది" అని బ్రాడ్ అన్నారు. తన కెరీర్‌లో మొత్తం 123 టెస్టులకు మ్యాచ్ రిఫరీగా వ్యవహరించిన క్రిస్ బ్రాడ్, 2024 ఫిబ్రవరిలో కొలంబోలో జరిగిన మ్యాచ్‌తో తన పదవీకాలాన్ని ముగించాడు.

## సత్య హీరోగా - రితేష్ రాణాతో కొత్త సినిమా సెట్ రెడీ!




**టాలీవుడ్, అక్టోబర్28:**తెలుగు సినిమా రంగంలో కామెడీ నటులు హీరోలుగా మారడం కొత్త విషయం కాదు. బ్రహ్మానందం, వేణు, వెన్నెల కిషోర్ వంటి పలువురు హాస్య నటులు గతంలో ప్రధాన పాత్రల్లో నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఆ జాబితాలో మరో పేరు చేరబోతోంది కామెడీ నటుడు సత్య. మత్తు వదలరా సిరీస్‌తో గుర్తింపు ఇటీవలి కాలంలో సత్య తెలుగు సినీ ప్రపంచంలో అత్యంత బిజీ కామెడీ నటుడిగా ఎదిగాడు. ఆయన నటన, కామెడీ టైమింగ్ ప్రేక్షకులకు బాగా నచ్చడంతో చిన్నాపెద్దా చిత్రాలన్నింటిలోనూ ఆయనకు డిమాండ్ పెరిగింది. సత్యకు మంచి గుర్తింపు తెచ్చిన చిత్రం మత్తు వదలరా సిరీస్. రితేష్ రాణా దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో సింహా కొడూరి హీరోగా నటించగా, సత్య పాత్ర రెండు భాగాల్లోనూ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ఆయన ప్రదర్శన సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హీరోగా సత్య–రితేష్ రాణా కొత్త ప్రాజెక్ట్ ఇప్పుడు అదే దర్శకుడు రితేష్ రాణా మళ్లీ సత్యతో కొత్త చిత్రం చేయబోతున్నాడు. ఈ సినిమా కూడా ఆయన స్టైల్లో ఉండే ఫన్ ఎంటర్టైనర్‌గా రూపొందనుందని సమాచారం. ఈసారి మాత్రం సత్య పూర్తి స్థాయి హీరోగా కనిపించనున్నాడు. ఈ చిత్రాన్ని ప్రముఖ బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించనున్నారని సినీ వర్గాల టాక్. త్వరలోనే అధికారిక ప్రకటన విడుదల కానుంది. సత్య బిజీ షెడ్యూల్ ఇకపోతే, సత్య ప్రస్తుతానికి అనేక ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు. రామ్‌చరణ్ నటిస్తున్న పెద్ది సినిమాలో కీలక పాత్రలో కనిపించనున్నాడు. అదనంగా మరికొన్ని సినిమాల్లో కూడా ఆయన నటనను ప్రేక్షకులు త్వరలో చూడబోతున్నారు.

## బాబోయ్..ఆత్మహత్యల పై చాట్ జిపిటి లో చర్చించుకుంటున్న జనం




**న్యూఢిల్లీ, అక్టోబర్28:**మన సౌకర్యం కోసం..మన ఆనందం కోసం. మరింత సౌలభ్యంగా, వేగంగా పనులు చేసుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకుంటున్న మనం చివరికి మన వినాశనానికే అధికంగా ఉపయోగించడం విచారకరం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఓపెన్ ఏఐ సంచలన విషయాలు వెల్లడించింది. తమ చాట్ బాట్ చాట్ జీపీటీతో ప్రతివారం పదిలక్షల మందికి పైగా యూజర్లు ఆత్మహత్య ఆలోచనల గురించి చర్చిస్తున్నారని, ఇది తీవ్ర ఆందోళన కలిగించే అంశమని తెలిపింది. ఏఐపై ప్రజలు మానసికంగా, భావోద్వేగపరంగా ఎంతలా ఆధారపడుతున్నారో ఈ డేటా స్పష్టం చేస్తోంది. ప్రతి వారం చాట్ జీపీటీని వాడే యాక్టివ్ యూజర్లఓ 0.15శాతం మంది ఆత్మహత్యకు సంబంధించిన సంభాషణలు జరుపుతున్నారు. ప్రస్తుతం చాట్ జీపీటీకి వారానికి 800 మిలియన్లమంది యాక్టివ్ యూజర్లు ఉండగా, ఈ లెక్క పదిలక్షలకు పైగానే ఉంటుంది. దాదాపు ఇదే సంఖ్యలో యూజర్లు చాట్ జీపీటీపై తీవ్రమైన భావోద్వేగ అనుబంధం పెంచుకుంటున్నారని, లక్షలాది మందిలో మానసిక రుగ్మతల లక్షణాలు కనిపిస్తున్నాయని కూడా కంపెనీ పేర్కొంది. ఈ సంభాషణలు గణాంకపరంగా చాలా అరుదైనప్పటికీ, తీవ్రమైన మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారిసంఖ్య గణనీయంగా ఉందని ఇది సూచించడం విషాదం. 170 మంది మానసిక నిపుణులతో కలిసి పని ఈ గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నప్పటికీ, తమ ప్లాట్‌ఫామ్ ను సురక్షితంగా మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించే క్రమంలో ఓపెన్ ఏఐ ఈ వివరాలను పంచుకుంది. మానసిక ఆరోగ్య సంక్షోభం, ఆత్మహత్య ఆలలోచనల వంటి సున్నితమైన అంశాల్లో చాట్ బాట్ స్పందించే తీరును మెరుగుపరిచేందుకు 170మందికి పైగా మానసిక ఆరోగ్య నిపుణులతో కలిసి పనిచేసినట్లు తెలిపింది. కొత్తగా అప్ డేట్ చేసిన జీపీటి5 మోడల్ సున్నితమైన విషయాల్లో చాలా మెరుగ్గా పనిచేస్తున్నట్లు ఓపెన్ ఏఐ వెల్లడించింది. అంతర్గత పరీక్షల్లో, పాత మోడల్తో పోలిస్తే కొత్తమోడల్ 65 శాతం అధికంగా సరైన రీతిలో స్పందించిందని కంపెనీ పేర్కొంది. ముఖ్యంగా ఆత్మహత్యకు సంబంధించిన సంభాషణల్లో భద్రతా నియమాలను పాటించడంలో పాత వమోడల్ 77శాతం సక్సెస్ అయితే, కొత్త మోడల్ 91శాతం కచ్చితత్వంతో పనిచేసిందని వివరించింది. కంపెనీపై తల్లిదండ్రుల దావా ఈ మెరుగుదలలు ఉన్నప్పటికీ ఓపెన్ ఏఐ తీవ్ర విమర్శలు, న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొంటోంది. చాట్ జీపీటీతో చర్చించిన తర్వాత 16 ఏళ్ల బాలుడు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కంపెనీపై దావా వేశారు.

## సిద్ధరామయ్య కు హైకోర్టులో చుక్కెదురు



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల విషయంలో కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో ఆరెస్సెస్ తదితర సంస్థల కార్యకలాపాలకు ముందస్తు అనుమతిని తప్పనిసరి చేస్తూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టు మంగళవారం మధ్యంతర స్టే విధించింది. తదుపరి విచారణను హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ నవంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యం, బీజేపీ ఆరోపణలు ఆరెస్సెస్ ఏర్పడి వందేళ్లు పూర్తయిన నేపథ్యంలో భారీస్థాయిలో కవాతులు నిర్వహించేందుకు రాష్ట్ర బీజేపీ నాయకులు సన్నద్ధమవుతున్నారు. ఈ తరుణంలోనే సిద్ధరామయ్య ప్రభుత్వం అక్టోబర్ 18న ఈ కీలక ఉత్తర్వులను జారీ చేసింది. ప్రైవేటు సంస్థలు, సంఘాలు తమ కార్యకలాపాల కోసం ప్రభుత్వ మైదానాలు, రహదారులు, బహిరంగ ప్రదేశాలు, విద్యాసంస్థల ఆవరణలను వినియోగించుకోవాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి అని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఉత్తర్వులను ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అన్ని జిల్లాల యంత్రాంగాలను ఆదేశించింది. అయితే, రాష్ట్రంలో ఆరెస్సెస్ కార్యకలాపాలను నిషేధించే ఉద్దేశంతోనే సిద్ధరామయ్య ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని బీజేపీ తీవ్రంగా ఆరోపిస్తోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇటీవల ఓ ప్రాంతీయ చానల్‌తో మాట్లాడిన డీకే శివకుమార్, సీఎం ఎంపికకు అధిష్ఠానం అభిప్రాయం ఒక్కటే సరిపోతుందని, ఎమ్మెల్యేల మద్దతు అవసరం లేదన్నట్లుగా వ్యాఖ్యానించారు. దీనిపై విలేకరులు ప్రశ్నించగా సిద్ధరామయ్య బదులిస్తూ "ఎమ్మెల్యేల అభిప్రాయం లేకుండా ఎవరూ ముఖ్యమంత్రి కాలేరు. మెజారిటీ మద్దతు తప్పనిసరి. అయితే, అధిష్ఠానం ఆశీస్సులు కూడా కచ్చితంగా ఉండాలి. రెండూ ముఖ్యమే" అని తేల్చిచెప్పారు. కేవలం అధిష్ఠానం అభిప్రాయం ఉంటే సరిపోదని, అత్యధిక ఎమ్మెల్యేల మద్దతు లేకుండా ఎవరూ ముఖ్యమంత్రి కాలేరని ఆయన సోమవారం స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో సిద్ధరామయ్య స్పందన ప్రాధాన్యం సంతరించుకుంది.